గుర్తింపు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి వెంకటయ్యకు రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సంఘం ప్రతి. నిధులు కోరారు. సోమవారం సంఘం అధ్యక్షులు అధ్యక్షులు ఎం.ఆచార్య, సెక్రటరీ కె.శ్రీనివాస్ శంకర్, ట్రెజరర్ అబ్దుల్ రహమాన్‌లు ఎంఈఓను కలిసి గుర్తింపు లేని పాఠశాలలతో విద్యార్థులు నష్టపోతున్నారని, ఒక స్కూల్ అనుమతితో అదనంగా స్కూల్స్ నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా...లేదా తెలుసుకొని పాఠశాలల్లో చేర్పించాలని సంఘం ప్రతినిధులు సూచించారు.

ఆర్కిటెక్చర్ కళాశాలలో ధరణీ దినోత్సవం



ప్రిన్సిపల్ జిమ్మిథామస్‌కు మొమెంటోను అందజేసిన సురభి వాణిదేవి

మాదాపూర్: ధరణి దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో కెనడియన్ వుడ్ సహకారంతో డిజైన్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, డైరెక్టర్ ఎస్. అజితా శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ కామినిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024 పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్ మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. ఈ ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేత ఉత్పత్తులు కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 25 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

మూసాపేట: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 5.30 గంటల నుంచి భవ్య హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామ దండు సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బ్యూటీ క్లినిక్‌లపై దాడులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాయదుర్గంలోని దీప్తి పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మొటిక్ క్లినిక్ సహా మాదాపూర్‌లోని వీ–స్పార్క్ వెల్‌నెస్ క్లినిక్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఆయా క్లినిక్‌లలో తనిఖీలు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్స్ నడపడంతో పాటు అర్హులైన చర్మ వైద్యనిపుణులు లేకుండా చికిత్స చేయడం, డ్రగ్స్ లైసెన్సులు పొందకుండా బ్యూటీ ప్రొడక్ట్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయా క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సమన్వయంతో పని చేద్దాం.. రికార్డు మెజారిటీ అందిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి కార్యకర్తలు నాయకులు, సమన్వయంతో పనిచేసి.. రికార్డు మెజార్టీ అందించాలని మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు డివిజన్, మండలాల మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ కలెక్టర్, సమర్థుడైన వెంకట్రాంరెడ్డి లాంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే, మెదక్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపచేస్తారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు 100 కోట్ల రూపాయలతో పేద ప్రజల కోసం ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నట్లు ఇప్పటికే ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ , సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మెరాజ్ ఖాన్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



పడకేసిన

ఈర్ల చెరువు పార్కు పనులు

మేయర్ దత్తత తీసుకున్నా కానరాని అభివృద్ధి



ఈర్ల చెరువులో మురుగునీరు చేరుతున్న దృశ్యం

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు పార్కు అభివృద్ధికి నోచుకోలేదు. మరో పక్క చెరువు సుందరీకరణ అంటూ నిధులు వెచ్చించినా ఫలితం లేదు. నగర మేయర్ ఈర్ల చెరువును తీసుకున్నారని అభివృద్ధి షురూ అని స్థానికులు భావించారు. ఆదిశగా పనులు జరగలేదు. ఈర్ల చెరువు పార్కు ముఖద్వారం నుంచి 200 మీటర్ల వాకింగ్ ట్రాక్ తప్ప పచ్చదనం మాత్రం కానరాదు. లక్షలాది రూపాయలు పార్కు అభివృద్ధికి కేటాయించినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

- ఈర్ల చెరువు పార్కులో వాకింగ్ ట్రాక్ మాత్రం కనపడుతోంది.
- చెరువు అలుగు పనులు అసంపూర్తిగా ఉన్నాయి
- రాత్రి సమయాలలో మందుబాబులకు అడ్డాగా మారిన పార్కు.
- ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మేయర్ దృష్టి సారించాలి



ఈర్ల పార్కుపై జీహెచ్ఎంసీ మేయర్ ప్రత్యేక దృష్టి సారించాలి. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా మేయర్ ఆదేశాలు ఇవ్వాలి. – సి.బి.రెడ్డి, మైత్రినగర్

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



చెరువు సుందరీకరణ పనులు తక్షణమే ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అసంఘటిత కార్యకలాపాలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. – రవి, మదీనాగూడ



ఈర్ల చెరువు పార్కు



వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా పిచ్చి మొక్కలు



పార్కులో మద్యం సీసాలు

నాలెడ్జి సిటీలో 'డబుల్ బుక్ లాంచ్'

రాయదుర్గం: హ్యాపీ ఎవల్యూషన్ వ్యవస్థాపకురాలు, రచయిత పల్లవిజవార్ రచించిన రెండు పుస్తకాలను సోమవారం నాలెడ్జి సిటీలో డబుల్ బుక్ లాంచ్ పేరిట ఆవిష్కరించారు. తల్లిదండ్రుల వద్ద సంతోషకరమైన వాతావరణం, మన జీవితంలో మంచి క్షణాలు తదితర అంశాలపై ఆమె పుస్తకం రాశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కీస్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీరామ్ హైద రాబాద్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకురాలు సింధూరి కందుకూరి, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ శుభావిల్లాస్, పారిశ్రామిక వేత్త అల్కాబంగర్, రచయిత అంజుపొద్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత పల్లవిజవార్ మాట్లాడుతూ పిల్లల పెంపకంపై ఈ పుస్తకం పలు సృజనాత్మక మార్గాలను అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఓటు హక్కు ఉన్నవారు విధిగా ఓటు వేయాలి



మియాపూర్‌లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, స్థానికులు

గచ్చిబౌలి: ఓటు హక్కు ఉన్నవారంతా విధిగా ఓటు వేయాలని అధికారులు కోరారు. మియాపూర్‌లోని తండా, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఓటరు అవగాహనా కార్యక్రమాన్ని అధికారులు సోమవారం నిర్వహించారు. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికలలో ఓటు హక్కు ఉన్నవారంతా ఓటు వేయడమే కాకుండా తమ కుటుంబసభ్యులు, స్నేహితులు, పరిసరాల్లోని వారు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్ రోజు ప్రభుత్వం అందరూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సెలవు దినంగా కూడా ప్రకటించడం జరుగుతుందని వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు కాలనీలు, బస్తీలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని వారు వివరించారు. కార్యక్రమంలో లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, పీఓ ఉమారాణి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులకు బ్రేక్

మార్కెట్ కోసం దూరప్రాంతాలకు వెళుతున్న స్థానికులు



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో అనేక కొత్త కాలనీలు రావడంతో జనాభా పదింతలు పెరిగింది. అయితే పెరిగిన జనాభాకు సరిపడా సౌకర్యాలు కల్పించడంలో పాలకులు శ్రద్ధ తీసుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ లేక స్థానికులు కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు, నిత్యావసర సరుకుల కోసం సూపర్‌మార్కెట్‌లు లేదా వారాంతపు సంతలకు వెళ్లి ఎక్కువ ధరకు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని పాలకులు అన్ని వస్తువులు ఒక చోట లభించే విధంగా మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

అన్ని వస్తువులు ఒకేచోట లభించే విధంగా గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అన్ని వస్తువులు.. కూరగాయలు, మాంసం, వివిధ రకాల పండ్లు, పూలు, నిత్యావసర సరుకులు లభించే విధంగా ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాల నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులు..ఒక్కో మున్సిపాలిటీకి రూ.2 కోట్లు చొప్పున మంజూరు చేశారు. దీంతో మూడు మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు చేపట్టారు. మూడు మున్సిపాలిటీలలో పనులు జరుగుతున్న సమయంలోనే ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. పనులు ఆగిపోవడానికి గల కారణం మాత్రం అధికారులు చెప్పడం లేదు.

మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



మార్కెట్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో సూపర్ మార్కెట్‌కు వెళ్లి అధిక ధర చెల్లించి సరుకులు తెచ్చుకుంటున్నాము. ప్రభుత్వం మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకొని వస్తే ఈ సమస్య ఉండదు. – రామ్‌కుమార్, ఉస్మాన్‌సాగర్

అందుబాటులోకి తెస్తాం



తెల్లాపూర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులు నిలిపోయిన మాట వాస్తవమే. నిర్మాణ పనులను త్వరలో మొదలుపెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తాం. – సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం





కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లోని కోమటికుంట వద్ద ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌నగర్, తాజ్‌నగర్, సోఫాకాలనీ, గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, వీకర్ సెక్షన్ కాలనీ పరిసరాల్లోని బస్తీవాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నందినీనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పూజితగౌడ్, రంజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

హఫీజ్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని నందినినగర్, అంబేద్కర్‌నగర్‌లలో రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల మార్పు

శేరిలింగంపల్లి: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలో ఎన్నికల సంఘం పలు పోలింగ్ స్టేషన్ల మార్పులను ప్రకటించింది. శేరిలింగంపల్లి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి సోమవారం వివరాలను వెల్లడించారు.

- ప్రేమ్‌నగర్‌లోని శ్రీరామ ప్రీ ప్రైమరీ స్కూల్ నుంచి న్యూ హఫీజ్‌పేట్‌లోని సాహితి విద్యా నికేతన్ స్కూల్‌కు పోలింగ్ స్టేషన్లను నంబర్లు 306,311,312,313,314లను మార్చినట్లు తెలిపారు.
- ప్రేమ్‌నగర్‌లోని చైతన్య మోడల్ స్కూల్ నుంచి వికాస్ మోడల్ స్కూల్ హఫీజ్‌పేట్‌లోకి 321 పోలింగ్ స్టేషన్ మార్పు
- ప్రేమ్ నగర్‌లోని చైతన్య మోడల్ స్కూల్ నుంచి లిటిల్‌స్టార్ టాలెంట్ స్కూల్ న్యూహఫీజ్‌పేట్‌లోకి పోలింగ్ స్టేషన్లు 322, 323 మార్చారు.
- 1600 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు 17, 21,44,122, 143,207, 221, 252, 371,423, 429 పోలింగ్ స్టేషన్‌లలో ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నగరానికి థాయ్ చెఫ్ రాక ..

సాక్షి, సిటీబ్యూరో: తనదైన ప్రత్యేకతతో ఆసియా ప్రాంతపు వంటకాలకు అంతర్జాతీయంగా పేరొందిన థాయ్‌ల్యాండ్‌కు చెందిన లేడీ చెఫ్ సీఫా కెచాయో నగరానికి వస్తున్నారు. గచ్చిబౌలి షెరటాన్ హోటల్‌లోని జెగా రెస్టారెంట్ వేదికగా 2 రోజుల పాటు తన స్పెషల్ రుచులను నగరవాసులకు అందించనున్నారు. బ్యాంకాక్ వీధుల్లో ఏషియన్ స్ట్రీట్ ఫుడ్ నిర్వహణ ద్వారా పేరొందిన చెఫ్ కరణ్ బానెతో కలిసి సదరన్ థాయ్, క్రాబ్ కర్రీ, స్టీమ్ సీబాస్, స్పైసీ లెమన్ బ్రోత్...తదితర తన స్పెషల్ డిష్‌లను ఈ లేడీ చెఫ్ వడ్డించనున్నట్టు హోటల్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం నుంచి 2 రోజుల పాటు మాత్రమే థాయ్ చెఫ్ ఆతిథ్యంతో పాటు ఆమెతో సంభాషించే అవకాశం కూడా ఉందన్నారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం నామినేషన్ దాఖలు చేస్తారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేస్తారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ధరణినగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం అసోసియేషన్ సభ్యులతో కాలనీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సిహెచ్.భాస్కర్, రాజబాబు, సత్యనారాయణ, డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, రామారావు, సత్యనారాయణ, శివకుమార్, వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'లో టీచర్ ఆఫ్ ది ఇయర్ ఎంపిక

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. అందులో భాగంగా పబ్లిక్ పాలసీ విభాగంలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(ఏఎంపీపీపీ) క్లాస్ ఆఫ్ 2023, అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్‌కేర్ (ఏఎంపీహెచ్) క్లాస్ 2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లను ఎంపిక చేసి వారిని సన్మానించారు. ఏఎంపీహెచ్‌క్లాస్–2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన వారిలో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ప్రొఫెసర్ నందు నందకిషోర్, ప్రొఫెసర్ సారంగ్‌డియో, పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ సిద్దార్థ్ ఎస్ సింగ్ ఏఎంపీపీపీ క్లాస్–2023లో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ఏఎంపీహెచ్ క్లాస్–2023లో ప్రొఫెసర్ నందు నందకిషోర్, పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ షమికారవి, పీజీపీ క్లాస్–2024 కోర్ కార్సెస్‌లో ప్రొఫెసర్ సుమిత్‌కున్నుమ్‌కల్, ప్రొఫెసర్ మిలింద్ సోహోని, ప్రొఫెసర్ ఎం విజయసుందర్ ఎంపికయ్యారు. వీరిని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

టెలికామ్‌నగర్‌లో బీజేపీ ప్రచారం



రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటి పార్టీ కరపత్రాలను అందిస్తూ, బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులు దినేష్‌యాదవ్, ప్రవీణ్, రవీందర్, అనురాగ్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో టెక్నికల్ ఫెస్ట్

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో రెండురోజుల సాంకేతిక ఉత్సవం–2024 ప్రారంభమైంది. ఈ టెక్నికల్ ఫెస్ట్‌ను వీసీ ప్రొ. డా. కట్టా నరసింహారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్య నేర్చుకున్న విషయాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడమే టెక్నికల్ ఫెస్ట్ ఉద్దేశమన్నారు. సీనియర్ ప్రొ. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే కొత్త ఆలోచనలు చేసి ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జీవీ నరసింహారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డా. వి.పద్మావతి, పలు విభాగాల డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు షురూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చోటు చేసుకున్న సంఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలను సోమవారం ప్రారంభించారు. ఏబీవీపీ సభ్యులలో దాడులు చేసిన వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని ప్రజయ్ మెగా పోలీస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కేవి. ప్రసాద్‌రెడ్డి(46) టెక్ మహీంద్రలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 9.20 గంటలకు ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. భార్య మాధవి ఇంట్లో భర్త సెల్‌ఫోన్‌ను గమనించింది. వెంటనే భర్త ఆఫీస్‌కు ఫోన్ చేయగా ఆఫీస్‌కు రాలేదని తెలిపారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య మాధవి సోమవారం సాయంత్రం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.